# మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక


| సంపుటి : 01 | సంచిక : 145 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం, 23 ఏప్రిల్ 2026 | పేజీలు : 4 |
|---|---|---|---|---|




పెద్దిలో శృతి స్పెషల్ సాంగ్

4





## క్యూట్ బాయ్.. నైస్ వాటర్..!

జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాలనలో తనదైన శైలిలో దూసుకెళ్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు, సమీక్షలు నిర్వహిస్తూ అధికారులకు దిశనిర్దేశం చేస్తున్నారు. బుధవారం కూడా ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా చౌడారంలోని (టీజీఎంఎస్ & జూనియర్ కళాశాల) పీఎంశ్రీ పాఠశాలను సందర్శించారు. ఈ క్రమంలో ఓ బాలుడిని 'క్యూట్ బాయ్' అన్నట్టు చంప నిమురుతూ ముందుకు సాగారు. ఇక ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ సమయంలో అక్కడ ఏర్పాటు చేసిన తాగునీటి పంపు వద్ద స్వయంగా తాగి.. 'నైస్..వాటర్.. బాగున్నాయ్..' అన్నట్టుగా ఎక్స్ప్రెషన్ ఇస్తూ సంతృప్తి వ్యక్తం చేశారు. *- మన చౌరాస్తా, జనగామ*



## జనగామలో ఆర్టీసీ కార్మికల ఆందోళన

- డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఉద్యోగుల పోరాటం
- మద్దతు తెలిపిన టీఆర్పీ నాయకులు

2 లో









# కొనుగోళ్లలో టోకెన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలి

- బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- తాగునీటి నాణ్యతపై పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలి
- ప్రయాణికులకు ఇబ్బంది కలగద్దు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, మన చౌరాస్తా :** ధాన్యం కొనుగోళ్లలో టోకెన్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలని జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. బుధవారం జనగామ మండలంలోని చౌడారంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ క్రమంలో టోకెన్ల వారీగా జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించి, కేంద్ర నిర్వాహకులు, ఏఈఓను కలెక్టర్ అభినందించారు. ఎండ దెబ్బ తగలకుండా రైతులు, అధికారులు, ఇతర సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంతకుముందు జనగామ మండలంలోని చౌడారం పరిధిలో గల (టీజీఎంఎస్ & జూనియర్ కళాశాల) పీఎం శ్రీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్, ఐటీ ల్యాబ్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ ల్యాబ్, లైబ్రరీలను పరిశీలించి, ఏఏ పుస్తకాలు ఉన్నాయి అని లైబ్రేరియన్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోటీ పరీక్షలకు సంబంధించిన



పుస్తకాలు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. బడి బాట కార్యక్రమాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా నిర్వహించాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకోసారి తాగునీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ తనిఖీలు

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టాండ్‌ను సైతం కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే బస్ స్టాండ్‌లో తాగునీటి సదుపాయాలను పరిశీలించి, అక్కడ అందిస్తున్న తాగునీటి నాణ్యతను కలెక్టర్ స్వయంగా తాగి పరీక్షించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా ప్రయాణికులు వేచి ఉండే సమయం తగ్గించేలా టికెట్లు వేగంగా జారీ చేయాలని, ఆలస్యం లేకుండా బస్సులు నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలు ఇచ్చారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









# జనగామలో ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన

**జనగామ, మన చౌరాస్తా :** తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ టీజీఎస్ ఆర్టీసీ ప్రారంభించిన సమ్మెను నేటి నుంచి మరింత ఉధృతం కానుంది. గురువారం అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాను నిర్వహించాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఇక బుధవారంకూడా పలు డిపోల ముందు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జనగామలో బస్టాండ్ ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు బైఠాయించి నిరసన తెలిపారు. వీరికి టీఆర్పీ నాయకులు మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.అధికార మదంతో కార్మికుల పొట్ట కొడుతున్న రెడ్డి ప్రభుత్వం, తన పతనానికి తానే గోరీ కట్టుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జిట్ట బోయిన నరేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉదరి సతీష్ ముదిరాజ్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు బబ్బులు, యూత్ నియోజకవర్గ అధ్యక్షులు బోడా రమేష్, యూత్ మండల అధ్యక్షులు ముక్క విష్ణువర్ధన్, నాయకులు జలీల్ పాషా, అంజత్ పాషా, పాషాతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.







# దేశాయిపేటలో మెగా వైద్య శిబిరం

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ నగరంలోని దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీ.బీ.ముక్తి భారత్ అభియాన్ రెండో విడతలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డా. టి. భరత్ కుమార్ మాట్లాడుతూ అలసట,తలనొప్పి, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం వంటి క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించి వైద్య సేవలు పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి చికిత్స, నివారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు.వైద్య శిబిరంలో 235 మందికి రక్త పూత పరీక్షలు నిర్వహించగా, అందులో 104 మందికి డిజిటల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫుల్లీ కంప్యూటర్ చెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు చేశారు.ఈ కార్యక్రమంలో టీ.బీ నియంత్రణ విభాగం ప్రతినిధులు నరేష్, రంజిత్, సూపర్వైజర్ పబ్లిక్ హెల్త్ మేనేజర్ జన్ను కొర్నేల్, ఫార్మసీ ఆఫీసర్ ఎస్. అనిల్ కుమార్, అకౌంటెంట్ స్వర్ణలత, ఏ.ఎన్.ఎం.లు జ్యోతి, శోభ, అమృత, నిహారిక, సుల్తానా, కాల్వల కుమార్, ఆశ కార్యకర్తలు సుమలత, పరిమళ, గీత, సంధ్య, మమత, పూలమ్మ, శ్రీవాణి, ఆడెపు జ్యోతి, జన్ను బుచ్చయ్య, మేధా నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
గురువారం, 23 ఏప్రిల్ 2026
Mana Chourasta




# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి : టీఆర్ఆర్ఎస్

**జనగామ, మన చౌరాస్తా :** రజక సామాజిక వర్గం ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలంటే వారిని వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక డిమాండ్ చేశారు.జనగామ జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షులు ఏదునూరి నరేష్ అధ్యక్షతన నిర్వహించిన రజక రాజకీయ ప్రతినిధుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్ తో కలిసి గోపి రజక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇటీవలి మున్సిపల్ మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలలో జిల్లా నలుమూలల నుండి విజయం సాధించిన రజక సామాజిక వర్గ కౌన్సిలర్లు, సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు మెంబర్లను ఈ సందర్భంగా వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు.దశాబ్దాలుగా రజకులు తమను ఎస్సీ జాబితాలో చేర్చాలని పోరాడుతున్నారని, ఈ న్యాయమైన కోరికను ప్రభుత్వం వెంటనే మన్నించాలని కోరారు. దీని కోసం క్షేత్రస్థాయి నుంచి ప్రతి రజక బిడ్డ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.రజకులు కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే మిగిలిపోకూడదని, శాసనకర్తలుగా ఎదిగి తమ హక్కులను తామే సాధించుకోవాలని పిలుపునిచ్చారు.ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులు తమ పదవుల ద్వారా సామాజిక వర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కులవృత్తిపై ఆధారపడిన వారికి అండగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేష్, సంయుక్త కార్యదర్శి పోలసా అశోక్, జిల్లా రజక సంఘం నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

## నాణ్యమైన విద్య

**నర్మెట, మన చౌరాస్తా :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని నర్మెట్ట ఎంఈఓ మడిపల్లి ఐలయ్య అన్నారు. బుధవారం మండలంలోని మాన్సింగ్ తండా గ్రామంలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థుల భవిష్యత్తు అన్ని విధాల ముందంజలో ఉంటుందని ఉచిత పుస్తకాలు యూనిఫామ్, నాణ్యమైన భోజనం అందుబాటులో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం నీలం వేణు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు ఆర్ రామ్మోహన్ రెడ్డి, అంగన్వాడి టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.



## విద్యార్థులకు బాటిల్స్ పంపిణీ

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** మండలంలో కొడవటూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్టీల్ వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి HM నరసింహ స్వామి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎంఈవో వెంకట రెడ్డి, సర్పంచ్ నీల కవిత మురళి, వాటర్ బాటిల్స్ దాత బత్తుల ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి, నీల కవిత మురళి మాట్లాడుతూ దాతల ధాతృత్వం చాల గొప్పదని, విద్యార్థులకు వాటర్ బాటిల్స్ ఇచ్చి పిల్లల ఆరోగ్యం గురించి ఆలోచన చేసిన ఉపేందర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, కిషన్, మహమ్మద్ అంకుషావలి, రఘుమూర్తి, సిద్ధులు, శ్యామల, రాధిక పాల్గొన్నారు.

## వినూత్నంగా బడిబాట

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు కోసం "బడిబాట" కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించారు. గ్రామంలో ప్రజలు ఉపాధి హామీ పనులకు వెళ్లిన నేపథ్యంలో, వారిని నేరుగా కలిసే ప్రయత్నం చేశారు.బుధవారం గ్రామ సర్పంచ్ మాచర్ల కుమారస్వామి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశాలకు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న కూలీలను కలిసి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న సదుపాయాలను వివరించారు. ముఖ్యంగా స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రభుత్వ సౌకర్యాలను వివరించి, పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.గ్రామంలో ఎవరూ అందుబాటులో లేకపోవడంతో



ఉపాధి పనుల ప్రదేశాలకు వెళ్లి అవగాహన కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానికులు ఈ చర్యను అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, ఉప సర్పంచ్ శనిగరం ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు మరియు ఇతరులు పాల్గొన్నారు.



## మంగళంపల్లి రాజుకు అబ్దుల్ నబీ సాబ్ స్మారక అవార్డు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలోని ప్రముఖ కవులు , కళాకారులు కలసి ఏర్పాటు చేసిన కవులు కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఇచ్చే ప్రతిష్టాత్మక 'అబ్దుల్ నబీ సాబ్ స్మారక అవార్డు'ను ఈ ఏడాది యువ నాయకుడు, సామాజిక కార్యకర్త మంగళంపల్లి రాజుకు ప్రకటించినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు, హైకోర్టు న్యాయవాది మహమ్మద్ సాదిక్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య సమరకాలంలో రజాకార్ల అరాచకాలను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన మహమ్మద్ అబ్దుల్ నబీ సాబ్ త్యాగాన్ని స్మరిస్తూ, సామాజిక రంగంలో విశేష కృషి చేసిన వారికి ఈ అవార్డును ప్రదానం చేయడం జరుగుతోంది. అబ్దుల్ నబీ సాబ్ కుటుంబం తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిందని, వారి వారసత్వాన్ని గౌరవించడమే ఈ అవార్డు ముఖ్య ఉద్దేశమని సాదిక్ అలీ పేర్కొన్నారు.ఈ ఏడాది అవార్డుకు ఎంపికైన మంగళంపల్లి రాజు 2007 నుండి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.2009 మలిదశ ఉద్యమంలో విద్యార్థి జేఏసీ నాయకుడిగా పోరాడి అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారు.2015లో 'సేవ్ జనగామ' ఆధ్వర్యంలో జనగామ జిల్లా సాధన కోసం నిరంతర పోరాటం చేసి, జిల్లా ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.ప్రస్తుతం సోషల్ వాయిస్ ఫౌండేషన్ ద్వారా మద్యపాన నిషేధం,పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రహిత సమాజం మరియు బాలల హక్కుల కోసం కృషి చేస్తున్నారు.మంగళంపల్లి రాజు చేసిన సామాజిక సేవలను గుర్తించి, సాదిక్ ఫౌండేషన్ ఈ గౌరవాన్ని ఆయనకు అందజేస్తోంది. త్వరలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవార్డులు ఆదివారం రోజున ప్రదానం చేసినప్పటికీ ఆ రోజున మంగళంపల్లి రాజు అందుబాటులో లేనందున కవులు కళాకారుల ఐక్య వేదిక కార్యాలయంలో నిన్న కల్నల్ డా,బిక్షపతి చేతులమీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కవులు కళాకారుల ఐక్య వేదిక అధ్యక్షులు ప్రజా గాయకుడు జి కృష్ణ, ప్రధాన కార్యదర్శి పెట్లోజు సోమేశ్వర చారి, కోశాధికారి నరసింహ చారి, సభ్యులు సదానందం, సాయి, మనోజ్ కుమార్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## రైతులతో సమావేశమైన కలెక్టర్

వరంగల్, మన చౌరాస్తా : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం పర్వతగిరి మండలం చింత నెక్కొండ, గీసుకొండ మండలం మనుగొండ గ్రామాలకు చెందిన రైతులతో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేలో భూమి కోల్పోయిన రైతుల సమస్యలపై ఆర్బిట్రేషన్ నిర్వహించబడింది.రైతుల అభ్యర్థనలు, అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ డి సంధ్యారాణి, వరంగల్ ఆర్డీవో సుమ, సంబంధిత మండలాల తాసిల్దారులు, రైతులు పాల్గొన్నారు.



# పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీకాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**